

ఓపెన్ స్కూల్‌లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

పార్వతీపురం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం (ఓపెన్ స్కూల్)లో పదో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి బి.రాజ్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రెగ్యులర్ ఎస్ఎస్‌సీ పాత సిలబస్‌లో ఉత్తీర్ణత సాధించకపోయినా సార్వత్రిక విద్యాపీఠంలో చేరే అవకాశం ప్రభుత్వం కల్పించిందన్నారు. ఈ నెల 31లోగా రూ.300 చెల్లించి పదో తరగతిలో చేరవచ్చునన్నారు. పూర్తి వివరాలకు జిల్లా కో-ఆర్డినేటర్ ఎం.సుధాకరరావు (8790335145, 8500100223) నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

మన బస్సులు భద్రమేనా?





- జిల్లా నుంచి పదుల సంఖ్యలో ట్రావెల్స్ బస్సుల రాకపోకలు
- మితిమీరిన వేగంతో ప్రయాణం
- పాటించని నిబంధనలు
- పట్టించుకోని అధికారులు

- ఆగస్టు 19న విజయనగరం మండలం చెల్లూరు వద్ద ప్రైవేటు ట్రావెల్స్ బస్సు బోల్తా పడింది. విజయవాడ నుంచి పాలకొండ వెళుతుండగా తెల్లవారుజామున డివైడర్ ఎక్కి రోడ్డుపైకి దూసుకుపోయింది. ఆ సమయంలో వాహనాలేవీ రాకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఈఘటనలో పది మంది ప్రయాణికులు గాయపడ్డారు. ప్రాణ నష్టం జరగకపోవడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు.

పార్వతీపురం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి)

జిల్లా మీదుగా ప్రతిరోజూ అనేక ట్రావెల్ బస్సులు ప్రయాణిస్తుంటాయి. జిల్లా కేంద్రం పార్వతీపురంతో పాటు సాలూరు, పాలకొండ, కురుపాం మండల కేంద్రాల నుంచి విజయవాడ, గుంటూరు, హైదరాబాద్ తదితర ప్రాంతాలకు పదుల సంఖ్యలో ట్రావెల్ బస్సులు రాకపోకలు సాగిస్తుంటాయి. కర్నూలు ఘటన నేపథ్యంలో ఈ బస్సుల్లో ప్రయాణం భద్రమేనా? అన్న ప్రశ్న అందరిలో ఉదయిస్తోంది. కొన్ని లోపాలు తరచూ చర్చకు వస్తున్నా ఏం కాదులే అన్న నిర్లిప్తతతో యథావిధిగా ప్రయాణాలు సాగిస్తున్నాయి. ప్రధానంగా ఫైర్‌సేఫ్టీ ప్రమాణాలను పాటించడం లేదు. పార్వతీపురం పట్టణంలో సాయంత్రం ఐదు దాటితే చాలు ట్రావెల్స్ బస్సుల హవా కనిపిస్తోంది. ఆ డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలను లెక్కచేయడం లేదు. పోలీసులు సైతం పట్టించుకోవడం లేదు. ఆర్టీవో అధికారులు కూడా చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ముఖ్యంగా ఇతర రాష్ట్రాలకు వెళ్లే ట్రావెల్స్ బస్సులు రాత్రిపూట మితిమీరిన వేగంతో దూసుకుపోతుంటాయని అందరూ చెబుతున్నారు. ఈ విషయంలో వారికి (మిగతా 8వ పేజీలో..)



బస్సు లోపల ఇలా..

ప్రైవేట్ బస్సుల తనిఖీ..

బెలగాం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురం పట్టణంలో పోలీసులు, ఆర్టీవో అధికారులు సంయుక్తంగా ప్రైవేట్ బస్సులను శనివారం తనిఖీ చేశారు. పట్టణ ఎస్ఐ గోవిందరావు, ఎంవీఐ కాశీరాం తమ సిబ్బందితో కలిసి ప్రైవేట్ ట్రావెల్స్‌ను తనిఖీ చేశారు. బస్సుల ఫిట్‌నెస్, ఇన్సూరెన్స్, పర్మిట్ తదితర పత్రాలను పరిశీలించారు. నిబంధనల మేరకు ఎమెర్జెన్సీ డోర్ల పరిస్థితి, ఫైర్ సేఫ్టీ, సుత్తి తదితర సామగ్రి ఉన్నాయా లేదా అని చూశారు.



బస్సును తనిఖీ చేస్తున్న అధికారులు



గరుగుబిల్లి: గొట్టివలస గ్రామంలో..



మక్కువరూరల్: ఎ.వెంకంపేటలో పుట్టవద్ద పూజలు చేస్తున్న భక్తులు

భక్తిశ్రద్ధలతో నాగుల చవితి

- పుట్టల వద్ద ప్రత్యేక పూజలు
- జిల్లాలో వెల్లివిరిసిన ఆధ్యాత్మిక సందడి

నాగుల చవితిని జిల్లా ప్రజలు శనివారం భక్తి శ్రద్ధలతో జరుపుకొన్నారు. ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పుట్టల వద్దకు వెళ్లి పూజలు చేశారు. పుట్టల్లో పాలు, గుడ్లు వేశారు. చలిమిడితో పాటు బెల్లం, నువ్వులతో చేసిన చిమ్మిలిని నైవేద్యంగా సమర్పించారు. నాగేంద్ర చల్లగా చూడయ్యా అంటూ వేడుకున్నారు. అనంతరం బాణసంచా కాల్చారు. జిల్లా కేంద్రం పార్వతీపురంతో పాటు కురుపాం, సాలూరు, పాలకొండలో ఆధ్యాత్మిక సందడి వెల్లివిరిసింది. సాలూరులో మంత్రి సంధ్యారాణి నాగుల చవితి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కుటుంబసభ్యులతో కలిసి పుట్ట వద్ద పూజలు చేశారు. లోకాన్ని చల్లగా చూడాలని నాగేంద్రుడిని కోరుకున్నట్టు ఆమె తెలిపారు. -ఆంధ్రజ్యోతి బృందం



బోడిమెట్ట వద్ద జనాల రద్దీ

బోడిమెట్ట వద్ద సందడి

వీరఘట్టం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి సమీపంలో ఉన్న అచ్చెపువలస గ్రామం బోడిమెట్ట వద్ద శనివారం జరిగిన గోవింద పేరంటాలు యాత్రకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ప్రతి సంవత్సరం నాగుల చవితి రోజు సాయంత్రం ఈ యాత్ర జరుగుతుంది. ఈ ఏడాది జరిగిన యాత్రకు వీరఘట్టంతో పాటు పరిసర గ్రామాల నుంచి పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చి సందడి చేశారు. గోవింద పేరంటాలను దర్శించుకున్న తర్వాత బోడిమెట్ట ఎక్కి ఆనందంగా గడిపారు.

ఆరోగ్య సర్వేలు
పక్కాగా చేయాలి
- ఎన్‌సీడీ ప్రోగ్రాం జిల్లా అధికారి జగన్మోహనరావు
8లో

ఐటీఐతో
ఉపాధి అవకాశాలు
- ఇన్‌చార్జి పీవో పవార్ స్వప్నిల్ జగన్నాథ్
8లో

జిల్లాకు 1,670
దోమ తెరలు
8లో

టెట్ నుంచి
మినహాయించాలి
8లో

రైతుల్లో తుఫాన్ కలవరం

- కోత దశలో వరి పంట
- అధిక వర్షాలు పడితే నష్టం తప్పదు
- యంత్రాంగం అప్రమత్తం.. అధికారులకు సెలవులు రద్దు
- కంట్రోల్ రూమ్ ఏర్పాటు



భామిని: దిమ్మిడిజోలలో రోడ్డుపక్కనే మొక్కజొన్న గింజలపై టార్పాలిన్లు కప్పిన దృశ్యం



మాట్లాడుతున్న జేసీ యశ్వంత్‌కుమార్‌రెడ్డి

పార్వతీపురం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావం జిల్లాపై ఉంటుందని వాతావరణశాఖ హెచ్చరించింది. రాబోయే 72 గంటల్లో జిల్లాలో భారీ వర్షాలు కురవడంతో పాటు ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని హెచ్చరికలు జారీచేయడంతో రైతుల్లో కలవరం మొదలైంది. అధిక వర్షాలు పడితే పంటలకు నష్టం తప్పదని ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో ఈ ఖరీఫ్‌లో 1.76 లక్షల ఎకరాల్లో వరి సాగు జరిగింది. 2.5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా. ఇప్పటికే వరి పంట కోత దశకు చేరుకుంది. మరో వారం పది రోజుల్లో కోతలు ప్రారంభం కానున్నాయి. ఈ తరుణంలో తుపాన్‌తో భారీ వర్షాలు పడితే వేలాది ఎకరాల్లో పంట ముంపు బారిన పడే ప్రమాదం ఉందని రైతులు కలవరపడుతున్నారు. ఇప్పటికే అడపాదడపా కురుస్తున్న వర్షాలతో పత్తి రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. తడిసిపోయిన పత్తిని వీధుల్లో ఆరబెడుతున్నారు. తుపాన్ ముప్పు నేపథ్యంలో క్షేత్రస్థాయిలో యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. జిల్లా, మండల స్థాయి అధికారులు, సిబ్బందికి కలెక్టర్ (మిగతా 8వ పేజీలో..)



పార్వతీపురంలో కోతకు సిద్ధంగా ఉన్న వరి పంట

మలేరియా రహిత సమాజం కోసం కృషి

- కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి

గుమ్మలక్ష్మీపురం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): మలేరియా రహిత సమాజం కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ ఎస్.ప్రభాకర్‌రెడ్డి కోరారు. మండలంలోని గొరిడి గ్రామంలో కలెక్టర్ ఆధ్వర్యంలో శనివారం 'మా ఊరికి మలేరియా వచ్చింది' అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందరంగా ఆయన మాట్లాడుతూ.. గొరిడిలో ఒక్క మలేరియా కేసు కూడా రాకూడదని, అందుకు తగిన జాగ్రత్తలు తీసుకుంటామని గ్రామస్థులు మాట ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. మలేరియా వ్యాప్తిని అరికట్టడానికి, ప్రజల్లో అవగాహన పెంచడానికి మా ఊరికి మలేరియా వచ్చింది పేరిట ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో ప్రస్తుతం నాలుగు యాక్టివ్ కేసులు ఉన్నాయన్నారు. మలేరియా సోకిన గ్రామంతో పాటు దానికి రెండు కిలోమీటర్ల పరిధిలో ఉన్న అన్ని నివాస ప్రాంతాలు, పాఠశాలలు, ఆసుపత్రుల్లో ఈ అవగాహన కార్య క్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. దోమలు కుట్టకుండా తప్పనిసరిగా దోమ తెరలు వినియోగించాలని, పొడవాటి చొక్కాలు, ప్యాంట్లు ధరించాలని, కర్పూరం వేసిన నూనెను రాసుకోవాలని సూచించారు. బంతి, చామంతి, నిమ్మగడ్డి వంటి మొక్కలను ఖాళీ స్థలాలు, గట్లుపై పెంచుకోవడం ద్వారా దోమలను అరికట్టవచ్చునని అన్నారు. ఎవరికైనా ఆగకుండా జ్వరం వస్తే వెంటనే సంబంధిత ఏఎన్ఎంకు ఫోన్ చేయాలన్నారు. వైద్య సిబ్బంది వచ్చి ఆర్‌టీడీ కిట్ ద్వారా పరీక్షలు చేస్తారన్నారు. ఈ సేవలు పూర్తిగా ఉచితమన్నారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి వై.మణి, వైద్యాధికారులు, ప్రజలు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి



కవిత మృతదేహంతో పాఠశాల గేటు వద్ద ఆందోళన చేస్తున్న కుటుంబ సభ్యులు, గ్రామస్థులు



ఆందోళనకారులతో చర్చిస్తున్న ఇన్‌చార్జి పీవో పవార్‌స్వప్నిల్ జగన్నాథ్

న్యాయం చేయండి

- పాఠశాల సిబ్బంది నిర్లక్ష్యంతోనే విద్యార్థిని మృతి
- మృతదేహంతో డొంబంగివలస గ్రామస్థుల ఆందోళన
- రూ.2 లక్షల పరిహారం, కుటుంబంలో ఒకరికి ఉపాధి కల్పిస్తామని పీవో హామీ

సీతంపేట రూరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): 'హడ్డుబంగి గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల సిబ్బంది నిర్లక్ష్యంతోనే ఆరో తరగతి విద్యార్థిని మండంగి కవిత((11) మృతి చెందింది. బాధిత కుటుంబానికి అధికారులు న్యాయం చేయాలి.' అని డొంబంగివలస గ్రామస్థులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం విద్యార్థిని మృతదేహంతో పాఠశాల గేటువద్ద కవిత తల్లిదండ్రులు, బంధువులు, గ్రామస్థులతో కలిసి గిరిజన సంఘ నాయకులు ఆందోళన చేశారు. తన బిడ్డ ఆరోగ్యం పట్ల పాఠశాల సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించి ప్రాణాలు పొట్టనపెట్టుకున్నారని కవిత తల్లిదండ్రులు మండంగి బాలకృష్ణ, చామంతి ఆరోపించారు. కవితకు జ్వరం వచ్చినా పాఠశాల సిబ్బంది ఆస్పత్రికి తీసుకెళ్లలేదని, దీంతో జ్వరం తీవ్రమై తెల్ల రక్తకణాల సంఖ్య తగ్గిపోవడం, నిమోనియా అటాక్ అవడంతో పాటు ఊపిరితిత్తుల్లో ఇన్‌ఫెక్షన్ కారణంగా తమ బిడ్డ మృతిచెందిందని అన్నారు. వారిపై చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పాలకొండ సీఐ ఎ.ప్రసాద్, స్థానిక ఎస్ఐ అమ్మనరావు ఆధ్వర్యంలో పోలీసులు భారీగా మోహరించారు. విషయం తెలుసుకున్న ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో పవార్‌స్వప్నిల్ జగన్నాథ్, డీడీ అన్నాదొర హడ్డుబంగి ఆశ్రమ పాఠశాలకు చేరుకొని ఆందోళనకారులతో మాట్లాడారు. జరిగిన అన్యాయాన్ని గిరిజన సంఘ నాయకులు సాయి, తిరుపతిరావు, సుందరమ్మ, కుమార్ (మిగతా 8వ పేజీలో..)

ఏనుగుల బీభత్సం

- పంటలు, వ్యవసాయ పరికరాలు ధ్వంసం

కొమరాడ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సోమినాయుడువలసలో శుక్రవారం రాత్రి ఏనుగులు బీభత్సం సృష్టించాయి. వరి, టమాటా తదితర పంటలతో పాటు మోటారు ఇంజన్లు, డ్రిప్ ఇరిగేషన్ పైపులను నాశనం చేశాయి. దీంతో ఆ ప్రాంత రైతులు లబోదిబోమంటున్నారు. వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టి వ్యవసాయం చేస్తుంటే ఏనుగుల వల్ల నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే అధికారులు స్పందించి తమకు నష్టపరిహారం అందించాలని కోరుతున్నారు. మరోవైపు గజరాజులను ఈ ప్రాంతం నుంచి తరలించాలని డిమాండ్ చేస్తున్నారు.



సోమినాయుడువలసలో వరి పంటను ధ్వంసం చేస్తున్న ఏనుగులు

భక్తిశ్రద్ధలతో నాగుల చవితి

- జిల్లా అంతటా సందడి
- పుట్టల్లో పాలు పోసి..

పూజలు చేసిన భక్తులు

జిల్లాలో నాగులచవితి పండుగను శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం నుంచి గ్రామీణ ప్రాంతాల్లో ఎటు వైపు చూసినా సందడి కనిపించింది. కుటుంబ సభ్యులతో కలిసి అందరూ పొలాల్లో ఉన్న పుట్టల వద్దకు వెళ్లారు. పుట్టల్లో గుడ్లు, పాలు పోసి.. పూజలు చేశారు. బాణసంచా కాల్చి సంతోషంగా గడిపారు.

(ఆంధ్రజ్యోతి బృందం)


గంట్యాడలో పుట్ట వద్ద కుటుంబ సభ్యులతో మంత్రి శ్రీనివాస్


నెల్లిమర్లలో భూలోకమ్మ పుట్ట వద్ద పూజలు


సాలూరు: పుట్ట వద్ద పూజలు చేస్తున్న మంత్రి సంధ్యారాణి, కుటుంబ సభ్యులు


కొత్తవలస: ములగపాకవానిపాలెంలో పొట్నూరు ఇంటిపేరు కలిగిన మహిళలంతా పుట్ట వద్దకు వెళ్తున్న దృశ్యం


విజయనగరం కల్చరల్: పుట్టల వద్దకు కుటుంబ సభ్యులతో కలిసి వెళ్తున్న నగరవాసులు


సంతకవిటి: మోదుగులపేటలో పుట్టల వద్దకు పొలాల గట్లపై వెళ్తున్న ప్రజలు


విజయనగరం: పూల్‌బాగ్ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో పుట్టలకు పూజలు

రేపు కొత్తవలసలో పీజీఆర్ఎస్

కొత్తవలస, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): కొత్తవలస తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు తహసీల్దార్ పి.అప్పలరాజు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి హాజరవుతారని చెప్పారు. ఈ వేదికలో రెవెన్యూ సమస్యలతో పాటు మిగిలిన ప్రభుత్వ శాఖలలో ప్రజల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకునే వీలుందన్నారు. ప్రజల నుంచి వచ్చే సమస్యలను ఆన్‌లైన్ చేస్తారని చెప్పారు.

జాతీయ స్థాయి సంగీత పోటీలకు ఎంపిక


విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

నెల్లిమర్ల, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): సారిపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు జాతీయ స్థాయి ఇన్‌స్ట్రుమెంటల్ మ్యూజిక్ పోటీలకు ఎంపికయ్యారు. విజయవాడలో ఈనెల 24న నిర్వహించిన పోటీల్లో వీరు పాల్గొని, ప్రథమ బహుమతి సాధించి, జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ మేరకు హెచ్ఎం పద్మాదేవి, స్కూల్ కమిటీ ఛైర్మన్ సారిపల్లి వెంకటరావు.. గైడ్ టీచర్స్ శ్రీనివాసరావు, రవిలకు, విద్యార్థులకు శనివారం అభినందనలు తెలిపారు.

బైండోవర్ కేసుల నమోదు

భోగాపురం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలో అక్రమంగా బెల్టు దుకాణాలు నిర్వహిస్తున్న 16మందిని ప్రొహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్ సీఐ వి.రవికుమార్ ఆధ్వర్యంలో శనివారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ రమణమ్మ ముందు హాజరు పరిచారు. ఈ మేరకు వారిపై బైండోవర్ కేసులు నమోదు చేశారు.

పందెంరాయుళ్ల అరెస్టు

భోగాపురం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని అవనాం జంక్షన్ పెట్రోల్ బంకు సమీప కొబ్బరి తోటలో కోడిపందాలు నిర్వహిస్తున్న ఏడుగురిని అరెస్టు చేసినట్టు సీఐ కె.దుర్గాప్రసాదురావు శనివారం తెలిపారు. ముందస్తు సమాచారంతో సిబ్బందితో కలిసి దాడి చేసి.. పోలిపల్లి, డెంకాడ చుట్టుపక్కల గ్రామాలకు చెందిన ఏడుగురు పందెంరాయుళ్లను అరెస్టు చేశామని చెప్పారు. వారి నుంచి ఆరు సెల్‌ఫోన్లు, 9 కోళ్లు, రూ.3,400 స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ మేరకు నిందితులపై కేసు నమోదు చేసి, రిమాండుకు తరలించామని సీఐ తెలిపారు.

స్తంభాల చోరీ

భోగాపురం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): బసవపాలెం సమీపంలో సర్వే నెంబరు63 ఖాతా నెంబరు 648లో 33 సెంట్ల స్థలం చుట్టూ పాతిన 23 ఫెన్సింగ్ స్తంభాలను దొంగిలించినట్టు గ్రామానికి చెందిన గాలి అప్పారావు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని సీఐ కె.దుర్గాప్రసాదరావు శనివారం తెలిపారు. దీనిపై దర్యాప్తు చేస్తామని ఆయన చెప్పారు.

నేడు రారవే సమావేశం

రాజాం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): రాజాం రచయితల వేదిక నిర్వహిస్తున్న నెలవారీ సాహిత్య కార్యక్రమాన్ని ఈనెల 26వ తేదీన ఆదివారం ఉదయం 10 గంటలకు స్థానిక విద్యానికేతన్ పాఠశాలలో నిర్వహిస్తున్నామని నిర్వాహకుడు గార రంగనాథం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రముఖ సాహితీవేత్త, కవి రౌతు గణపతిరావునాయుడు అధ్యక్షత వహించే సభలో రౌతు వాసుదేవరావు రచించిన 'తూరుపు కొండల్లో మెరిసిన మేరింగి' అనే నవలపై డాక్టర్ అల్లి మోహన్‌రావు ముఖ్యప్రసంగం చేస్తారని చెప్పారు. ఈ సమావేశానికి భాషాభిమానులు, సాహిత్యాభిమానులు హాజరు కావాలని రంగనాథం కోరారు.

నిరసన ర్యాలీకి తరలి రండి

నెల్లిమర్ల, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): వైద్య కళాశాల ప్రైవేటీకరణకు కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా వైఎస్ఆర్ ట్రేడ్ యూనియన్ ఈనెల 28న రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో నిరసన ర్యాలీలు చేపట్టనుందని వైసీపీ కార్మిక విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి దవళ లక్ష్మణరావు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని కార్మిక వర్గం జయప్రదం చేయాలని ఆయన శనివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు.

ఘనంగా కంచమ్మతల్లి జాతర


కంచమ్మతల్లిని దర్శించుకుంటున్న టీడీపీ నాయకుడు రామ్‌మల్లిక్‌నాయుడు

మెరకముడిదాం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): కొండలావేరు గ్రామ ఇలవేల్పు కంచమ్మ తల్లి జాతరను ప్రతిఏటా నాగుల చవితి రోజున నిర్వహించడం ఆనవాయితీ. ఈ మేరకు శనివారం బోడికొండపై ఉన్న కంచమ్మతల్లిని వేలాది మంది భక్తులు దర్శించుకున్నారు. మాజీ ఎంపీ బొత్స ఝాన్సీ లక్ష్మి, జడ్పీ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్‌మల్లిక్‌నాయుడు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఎస్ఐ లోకేష్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు. కమిటీ నిర్వాహకులు కొండపై తాగునీరు ఏర్పాటు చేశారు.

జల కాలుష్యంపై విచారణ


చెరువును పరిశీలిస్తున్న పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఏఈ శార్వాణి

రేగిడి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): సంకిలి చక్కెర కర్మాగారం నుంచి విడుదలవుతున్న వ్యర్థ జలాల వల్ల తమ పంట పొలాలకు నష్టం వాటిల్లుతుందని అప్పాపురం మాజీ సర్పంచ్, ఆ గ్రామ రైతు పల్లా వెంకట్రావు చేసిన ఫిర్యాదుపై పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఏఈ శార్వాణి శనివారం విచారణ నిర్వహించారు. కర్మాగార పరిధి దేవుదళ రెవెన్యూలో వంకాయలవాని చెరువులో ఫ్యాక్టరీ వ్యర్థ జలాలు చేరి.. తమ పంటపొలాలు పాడవుతున్నాయని బాధిత రైతు పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు అందించాడు. దీనిపై సంబంధిత చెరువును, ఆయకట్టు పొలాలను ఏఈ పరిశీలించారు. చెరువు నీటి నమూనాలు సేకరించి ల్యాబ్‌కు పంపిస్తున్నట్టు తెలిపారు. ఈమేరకు జోనల్ కార్యాలయానికి నివేదిస్తామని, ల్యాబ్ రిపోర్టుల మేరకు తదుపరి చర్యలు ఉంటాయన్నారు.

విప్లవ గాయకుడికి నివాళి

విజయనగరం దాసన్నపేట, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): బహుజన వాగ్గేయకారుల సాహిత్యాన్ని పాఠ్యాంశంగా చేర్చాలని బహుజన నేతలు ఆదాడ మోహనరావు, పి.ప్రభాకరరావులు అన్నారు. విప్లవ గాయకుడు కళేపూరి ప్రసాద్ జయంతి సందర్భంగా విజయనగరంలోని దళిత ఐక్యవేదిక కార్యాలయంలో గాయకుడు ఉదయ్‌భాస్కర్ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రసాద్ సినీ గేయ రచయితగా, అనువాదకుడిగా, వక్తగా, విశ్లేషకుడిగా అనేక రంగాల్లో విశేష సేవలు అందించారన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యమ నేతలు సూర్యనారాయణ, చోడి ఆదినారాయణ, వెంకటరమణ, నారాయణప్పుడు, భాస్కర్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు జిల్లా క్రీడాకారులు


టేబుల్ టెన్నిస్ పోటీలకు బయలుదేరిన జిల్లా క్రీడాకారులు

విజయనగరం టౌన్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయిలో జరుగనున్న స్కూల్స్ గేమ్స్‌లో టేబుల్ టెన్నిస్ క్రీడాకారులు విజేతలుగా నిలవాలని స్కూల్ గేమ్స్ కార్యదర్శులు గోపాల్, విజయలక్ష్మిలు ఆకాంక్షించారు. విశాఖ జిల్లాలోని గోపాలపట్నంలో జరుగనున్న స్కూల్ గేమ్స్ అండర్-14, 17 బాల బాలికల టేబుల్ టెన్నిస్ పోటీలకు విజయనగరం క్రీడాకారులు శనివారం బయలుదేరారు. ఈ టీమ్‌లకు కోచ్ మేనేజర్లుగా శ్రీనివాస్, ఎర్నమ్మలు వ్యవహరిస్తున్నారు. ఈసందర్భంగా క్రీడాకారులను పలువురు అభినందించారు.

ఫిర్యాదుల పరిష్కారంలో వేగం అవసరం

- కలెక్టర్ రామసుందర్ రెడ్డి


మాట్లాడుతున్న కలెక్టర్

విజయనగరం కలెక్టరేట్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కారంలో వేగం, నాణ్యత రెండింటిపై దృష్టి పెట్టాలని కలెక్టర్ రామసుందర్ రెడ్డి ఆదేశించారు. శనివారం పీజీఆర్ఎస్‌పై టెలికాన్ఫరెన్స్ నిర్వహించిన కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి విభాగం నుంచి ఎస్ఎల్ఏ గడువులో ఫిర్యాదులను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఆలస్యంగా పరిష్కరించిన ఫిర్యాదులపై సమీక్షించి... కారణాలను నమోదు చేయాలని ఆదేశించారు. ప్రీ ఆడిట్ దశల్లో ఉన్న ఫిర్యాదులపై దృష్టి పెట్టాలన్నారు. రీ ఓపెనింగ్స్ నివారించే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. అత్యధిక ఫిర్యాదులు రెవెన్యూ శాఖలోనే ఉన్నందున, వాటిపై ప్రత్యేక పర్య వేక్షణ ఉండాలని సూచించారు. దాదాపు 44శాతం అసంతృప్తి నమోదు కావడంపై కలెక్టర్ ఆందోళన వ్యక్తం చేశారు. అసంతృప్తి కేసులు సరిగా నమోదు చేయడంలో, డేటా అప్డేట్ చేయడంలో నిర్లక్ష్యం కనబరుస్తున్న విభాగాలపై తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వీఐపీల ఫిర్యాదుల పరిష్కారం విషయంలో ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. జిందాల్ భూ సమస్యలపై ఆర్డీవో స్థాయిలో పరిశీలించాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జేసీ సేతుమాధవన్, డీఆర్వో శ్రీనివాస్‌మూర్తి, పీజీఆర్ఎస్ నోడల్ అధికారి మురళి పాల్గొన్నారు.

రూ.66.36 కోట్లతో అమృత పథకం అమలు


సిబ్బందితో మాట్లాడుతున్న చీఫ్ ఇంజనీర్ ప్రభాకరరావు

విజయనగరం టౌన్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): నగర వాసులకు ఇబ్బంది కలుగకుండా రూ.66.36 కోట్లతో అమృత-2 పథకాన్ని అమలు చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని పబ్లిక్ హెల్త్ ఇంజనీరింగ్ ఇన్ చీఫ్ ఎం.ప్రభాకరరావు స్పష్టం చేశారు. శనివారం ముషిడిపల్లి వాటర్ వర్క్స్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం అమృత-2 ప్రతిపాదిత అంశాలపై సమీక్షించారు. అలాగే నగరంలో నీటి సరఫరాను తనిఖీ చేశారు. గతంలో చేపట్టిన పథకాల అమలుతీరును పరిశీలించారు. అనంతరం కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. అమృత-2 పథకం కింద రూ.66.36కోట్లు నిధులను ప్రభుత్వం మంజూరు చేసిందని తెలిపారు. దీనికి సంబంధించిన టెండర్ల ప్రక్రియ కూడా పూర్తయ్యిందన్నారు. ఇంకా సాంకేతిక ఆమోదం రావాల్సి ఉందని.. వచ్చిన వెంటనే పనులు ప్రారంభిస్తామని తెలిపారు. అలాగే 10ఎంఎల్‌డీ జలాల అభివృద్ధి విధానాన్ని పరిశీలించారు. 600 ఎంఎం గ్రావెటీ మెయిన్ లైన్ మార్పుతో పాటు ఇతర పనులను ప్రతిపాదించారని తెలిపారు. సూపరింటెండెంట్ పి.కామేశ్వరరావు, పబ్లిక్ హెల్త్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జ్యోతి, కార్పొరేషన్ ఈఈ ప్రసాద్, డీఈలు శ్రీనువాసరావు, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు



మాట్లాడుతున్న సీనియర్ న్యాయాధికారి శారదాంబ

రాజాం రూరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ర్యాగింగ్‌కు పాల్పడితే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని మండల న్యాయసేవాధికార సంస్థ అధ్యక్షురాలు, సీనియర్ న్యాయాధికారి కె.శారదాంబ స్పష్టం చేశారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశా లలో శనివారం నిర్వహించిన న్యాయఅవగాహన సదస్సులో ఆమె పాల్గొన్నారు. ర్యాగింగ్ నిరోధక చట్టం, పోక్సో, పని ప్రదేశంలో లైంగిక వేధింపులు తదితర చట్టాలపై ఆమె విద్యార్థులకు అవగాహన కల్పించారు. కళాశాలల మేనేజ్‌మెంట్ కచ్చితంగా ర్యాగింగ్ నిరోధించేందుకు కమిటీలను ఏర్పాటు చేయాలని ఆమె ఆదేశించారు. పిల్లలు గుడ్‌టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కలిగి ఉండాలన్నారు. పని ప్రదేశంలో లైంగిక వేధింపులు, శిక్షలపై సదస్సులో పాల్గొన్న జూనియర్ సివిల్ న్యాయాధికారి నైమిష వివరించారు. బార్ అసోసియేషన్ న్యాయవాదులు, పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

జిందాల్ భూముల్లో వాటాలా?


రిలే దీక్షలో నినాదాలు చేస్తున్న జిందాల్ నిర్వాసితులు

ఎస్.కోట రూరల్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): తాము 18 ఏళ్ల కిందట జిందాల్ పరిశ్రమకు ఇచ్చిన భూములు ఇప్పుడు కొంతమందికి వాటాలుగా మారనున్నాయన్న ప్రచారం జరుగుతుందని.. దీనిపై ప్రభుత్వం విచారణ చేపట్టాలని జిందాల్ నిర్వాసితులు కోరారు. శనివారం బొడ్డవరలో 125వ రోజు నిరసనలో భాగంగా వారు రిలే దీక్ష చేపట్టారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కొంతమంది తమకు న్యాయం జరగకుండా చేస్తున్నారని, కంపెనీతో కలిసి తమను మోసం చేస్తున్నారని ఆరోపించారు.

కుక్కను తప్పించబోయి..

- అదుపు తప్పి స్కూటీ బోల్తా
- అపస్మారక స్థితిలో భార్య
- భర్త, ముగ్గురు పిల్లలకు గాయాలు


గాయాల పాలైన పిల్లలు

భోగాపురం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఓ కుటుంబం రోడ్డు ప్రమాదానికి గురయ్యింది. భార్య అపస్మారక స్థితిలోకి వెళ్లగా.. భర్తతోపాటు ముగ్గురు పిల్లలకు తీవ్ర గాయాల య్యాయి. జాతీయ రహదారిపై నవరవల్లి సమీపంలో శనివారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని నందిగాం గ్రామానికి చెందిన గరి విజయలక్ష్మి, సూరిపాత్రుడు అనే భార్యభర్తలకు ఆరేళ్ల లోపుగల ఇద్దరు కుమార్తెలు, కొడుకు ఉన్నారు. శనివారం సాయంత్రం సూరిపాత్రుడు తన స్కూటీపై వారందరినీ స్వగ్రామం నుంచి తన అత్తవారి ఇల్లు విశాఖ జిల్లా మధురవాడకు తీసుకు వెళ్తున్నాడు. నవరవల్లి సమీపంలోకి వచ్చేసరికి రహదారికి అడ్డంగా కుక్క వచ్చింది. దాన్ని తప్పించబోయే క్రమంలో స్కూటీ బోల్తా పడింది. అందరూ రోడ్డుపై తుళ్లిపడ్డారు. విజయలక్ష్మికి తీవ్ర గాయాలు కాగా.. అపస్మారక స్థితిలోకి వెళ్లింది. కుమారుడు, ఇద్దరు కుమార్తెలకు తీవ్ర గాయాలయ్యాయి. సూరిపాత్రుడుకు కూడా గాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు అక్కడకు చేరుకున్నారు. హైవే అంబులెన్స్‌ను రప్పించి క్షతగాత్రులను తగరపువలస ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆ కుటుంబమంతా అక్కడ చికిత్స పొందుతోంది. దీనిపై ఇంకా కేసు నమోదు కాలేదని సీఐ కె.దుర్గాప్రసాదరావు తెలిపారు.

తుఫాన్‌పై అప్రమత్తంగా ఉండాలి

విజయనగరం టౌన్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ నేపథ్యంలో నగరవాసులంతా అప్రమత్తంగా ఉండాలని కార్పొరేషన్ కమిషనర్ పి.నల్లనయ్య అన్నారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఈనెల 26 నుంచి 29 వరకూ తుఫాన్ తీవ్రరూపం దాల్చనుందని తెలిపారు. కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేశామని, తుఫాన్ కారణంగా ఎవరైనా ఇబ్బందులు పడితే 9849906486 నెంబరుకు కాల్ చేయవచ్చన్నారు. లోతట్టు ప్రాంత ప్రజలు అప్ర మత్తంగా ఉండాలన్నారు. తుఫాన్ వల్ల పట్టణవాసులు ఇబ్బందులకు గురైతే స్థానికంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో పునరావాసం ఏర్పాటు చేశామన్నారు. ● వేపాడ, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): తుఫాన్ నేపథ్యంలో మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ జె.రాములమ్మ సూచించారు. ఆమె శనివారం విలేకర్లతో మాట్లాడారు. ప్రభుత్వం జిల్లాకు రెడ్ అలెర్ట్ ప్రకటించిందని తెలిపారు. రాబోయే 24 గంటల్లో ఆంధ్రప్రదేశ్‌లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉందన్నారు. వీఆర్వోలు, వీఆర్ఏలు గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. మండల కేంద్రంలో కంట్రోల్‌రూం ఏర్పాటు చేశామని చెప్పారు.

కల్తీ మద్యాన్ని తెలుసుకోవచ్చు


క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తున్న టీడీపీ నాయకుడు చంద్రశేఖరరావు

డెంకాడ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మద్యం దుకాణాలు, బార్లలో మద్యం కొనేముందు క్యూఆర్ కోడ్ స్కానింగ్ ద్వారా నాణ్యమైన మద్యమా.. కాదా అని తెలుసుకోవచ్చునని డెంకాడ మాజీ ఎంపీపీ కంది చంద్రశేఖర రావు తెలిపారు. శనివారం ఆయన డెంకాడలో మద్యం దుకాణాన్ని పరిశీలించారు. మద్యం నాణ్యతను సురక్ష యాప్ ద్వారా స్కాన్ చేసి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు పల్లె భాస్కరరావు, విజయనగరం పార్లమెంటరీ ఆర్గనైజింగ్ సెక్రటరీ కలిదిండి పాణిరాజు, పార్టీ మండల జనరల్ సెక్రటరీ కొయనేని రమణ, ఉపాధ్యక్షుడు పడాల చిన్నారావు, యాదవ సాధికార సమితి కన్వీనర్ కొర్నాన ఆదిబాబు, సింగవరం సర్పంచ్ పిట్ట అప్పారావు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ముగిసిన తైక్వాండో పోటీలు

విజయనగరం టౌన్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): జిల్లా క్రీడాకారులు జాతీయ స్థాయిలో రాణించి జిల్లాకు, రాష్ట్రానికి పేరు తీసుకురావాలని కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి ఆకాంక్షించారు. జిల్లా కేంద్రంలో రెండు రోజుల పాటు నిర్వహించిన రాష్ట్ర స్థాయి తైక్వాండో ముగింపు కార్యక్రమానికి ఆమె శనివారం హాజరయ్యారు. అనంతరం క్రీడాకారులకు మెడల్స్‌ను అందజేశారు. అసోసియేషన్ కార్యదర్శి సుంకరి సతీష్, కమిటీ సభ్యులు కె.రాంబాబు, బుగత శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఘనంగా నందన్న అనుపోత్సవం

- ఊరేగింపులో అలరించిన

బళ్ల వేషాలు.. సాంస్కృతిక కార్యక్రమాలు

జిల్లాలోని పలు గ్రామాల్లో శనివారం నందన్న సంబరాలు ఘనంగా నిర్వహించారు. దీపావళి రోజున గ్రామాల్లో నందన్నలు కొలువుతీరగా నాగులచవితి రోజున అనుపోత్సవం నిర్వహించారు. దీనిలో భాగంగా నిర్వహించిన ఊరేగింపులో పులివేషాలు, కోయ డ్యాన్సులు.. తదితర సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

(ఆంధ్రజ్యోతి బృందం)


బాడంగి: గజరాయనివలసలో నందన్నను ఊరేగిస్తున్న దృశ్యం


బొండపల్లి: కనిమెరకలో..


రామభద్రపురం: ఆరికతోటలో..


గజపతినగరంలో పులివేషాలు


గరుగుబిల్లి: పెద్దూరులో ఉత్సవ మూర్తుల ఊరేగింపు


బొబ్బిలి రూరల్: పెంటలో కొలువుదీరిన నందన్న


చీపురుపల్లిలో బళ్ల వేషాలు

ఆరోగ్య సర్వేలు పక్కాగా చేయాలి

● ఎన్‌సీడీ ప్రోగ్రాం జిల్లా అధికారి జగన్మోహనరావు

సీతానగరం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్య సర్వేలు పక్కాగా చేపడుతూ వ్యాధులను గుర్తించాలని ఎన్‌సీడీ ప్రోగ్రాం జిల్లా అధికారి డాక్టర్ టి.జగన్మోహనరావు స్పష్టం చేశారు. శనివారం మండలంలోని వెంకటాపురంలో హెల్త్ అండ్ వెల్‌నెస్ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆరోగ్య తనిఖీ రికార్డులు పరిశీలించి నమోదవుతున్న అనారోగ్య సమస్యల వివరాలను తెలుసుకున్నారు. ప్రస్తుతం కొనసాగుతున్న ఎన్‌సీడీ సర్వే తీరుపై ఆరాతీసి ఆన్‌లైన్ నమోదును పరిశీలించారు. సర్వే పారదర్శకంగా నిర్వహించి రక్తపోటు, మధుమేహం, క్యాన్సర్ లక్షణాలు గుర్తించాలని కోరారు. ప్రధానంగా నోటి, రొమ్ము, సర్వైకల్ క్యాన్సర్ అనుమానిత లక్షణాలను ముందస్తుగా గుర్తించి క్యాన్సర్ ముప్పు నుంచి తప్పించే విధంగా కృషి చేయాలని తెలిపారు. జాతీయ కుటుంబ ఆరోగ్యసర్వే నిర్దేశించిన లక్ష్యాలను చేయాలని పేర్కొన్నారు. ఏ చిన్న అనారోగ్య లక్షణాన్ని గుర్తించినా తక్షణమే చికిత్స అందేలా చూడాలని తెలిపారు. సంచార చికిత్స శిబిరంలో దీర్ఘకాలిక రోగుల పర్యవేక్షణ, వారి ఆరోగ్యం మెరుగుపై అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో సంధ్య, వైద్య సిబ్బంది, 104 సిబ్బంది పాల్గొన్నారు.


వెల్‌నెస్‌కేంద్రంలో రికార్డులను పరిశీలిస్తున్న జగన్మోహనరావు

డిగ్రీలో ప్రవేశానికి అవకాశం

పార్వతీపురంటౌన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కొత్తవలసలోని శ్రీవెంకటేశ్వర ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం చేరే విద్యార్థులకు మూడోవిడత ప్రవేశాలకోసం నమోదుకు అవకాశం కల్పించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ చలపతిరావు శనివారం ఒక ప్రకటనలో కోరారు.రాష్ట్ర ఉన్నత విద్యామండలి, ఆంధ్రాయూనివర్సిటీ అధికారుల ఆదేశాలు, సూచనల మేరకు, మూడో విడత డిగ్రీ అడిష్మన్ల ప్రక్రియకు విద్యార్థులు సంప్రదించాలని పేర్కొన్నారు. మొదటి, రెండోవిడతలో సీట్లురాని విద్యార్థులు కళాశాల కార్యాలయంలో అన్ని ధ్రువీకరణ పత్రాలతో సంప్రదించాలని కోరారు. కళాశాలలో బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సుల్లో చేరే విద్యార్థులకు ఈనెల 25, 26తేదీల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఉంటుందని తెలిపారు.ఈనెల 25 నుంచి 27వ వరకు ధ్రువీకరణ పత్రాల పరిశీలించనున్నట్లు పేర్కొన్నారు. నవంబరు ఒకటో తేదీన డిగ్రీ సీట్లు కేటాయించనున్నట్లు తెలిపారు.

నలుగురు బాధితులకు ఆర్థిక సాయం

పార్వతీపురం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురం ఆర్టీసీ బస్టాండ్ పార్శిల్ కౌంటర్ వద్ద ఈనెల 19న దీపావళి సామగ్రి పేలుడు సంఘటనలో గాయపడిన నలుగురికి ఆర్టీసీ ఆర్థిక సాయం ప్రకటించింది. ఈ ప్రమాదంలో గాయపడిన వారికి ప్రభుత్వాసుపత్రిలో చికిత్స అందుతోంది. బాధితులను ఆదుకోవాలని ఎమ్మెల్యే విజయచంద్ర విజయవాడలో రవాణాశాఖ మంత్రి ఎం.రాంప్రసాద్‌రెడ్డి, ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమరావును కలిశారు. దీంతో మంత్రి ఆదేశాల మేరకు ఆర్థికసాయం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే విజయచంద్ర కార్యాలయానికి ఆర్టీసీ నుంచి శనివారం సమాచారం అందింది.బాధిత కుటుంబాలకు రూ.9.75 లక్షలను తక్షణమే విడుదల చేసిన మంత్రి రాంప్రసాద్‌రెడ్డికి, ఎండీ ద్వారకా తిరుమలరావుకు ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న డ్రైవర్ ఎస్.రవికి రూ.ఐదువేలు, అక్కడే చికిత్స పొందుతున్న హమాలిరెడ్డి రమేష్‌కు రూ.ఐదులక్షలు, వియనగరంలో చికిత్స పొందుతున్న కె.రమేష్‌కు రూ.నాలుగు లక్షలు, పార్వతీపురం ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రిక్షా కార్మికుడు బి.సుందరరావుకు రూ.25 వేలు మంజూరు చేసినట్లు ఆదేశాలు అందాయని ఎమ్మెల్యే విజయచంద్ర శనివారం తెలిపారు.

విద్యార్థుల ఆరోగ్యంపై దృష్టి సారించాలి

గరుగుబిల్లి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వసతి గృహాల్లోని విద్యార్థుల ఆరోగ్యంపై అధికార యంత్రాంగం దృష్టి సారించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి టి.అఖిల్ కోరారు. శనివారం గరుగుబిల్లిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో సమస్యలపై అవగాహనకల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఈనెల 23న ప్రారంభమైన జీపుయాత్ర సోమవారం వరకూ జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రతినిధులు శరత్, దినేష్, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

కళాశాలకు సొంత భవనాలు నిర్మించాలి

వీరఘట్టం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): వీరఘట్టంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు సొంత భవనాలు నిర్మించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి టి.అఖిల్ కోరారు. జీపుయాత్ర జిల్లాలో మూడోరోజు వీరఘట్టం చేరుకుంది. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులకు కనీసం మౌలిక వసతులు కల్పించాలని, సొంత భవనాలు నిర్మించి డిగ్రీ కళాశాల నడపాలని కోరారు. ఈ కార్య క్రమంలో ఎస్ఎఫ్ఐ సభ్యులు పాల్గొన్నారు.

నిబంధనల మేరకు గృహాల మంజూరు

గరుగుబిల్లి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 25 పంచాయతీల్లో ప్రభుత్వ నిబంధనల మేరకు గృహాలు మంజూరు చేయనున్నట్లు మండల గృహ నిర్మాణశాఖ జేఈ వి.అఖిల్, వర్క్‌ఇన్‌స్పెక్టర్ ఎం.భాస్కరరావు తెలిపారు. శనివారం గరుగుబిల్లిలో ఏర్పాటుచేసిన కార్య క్రమంలో మాట్లాడుతూ గ్రామాల్లో అర్హులైన వారి సమాచారాన్ని నవంబరు ఐదో తేదీలోగా స్థానిక సచివాలయాల పరిధిలోని ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు అందించాలని కోరారు. గృహ నిర్మాణాలు పూర్తి చేయడానికి ముందుకొచ్చేవారికే ప్రాధాన్యత ఉంటుందన్నారు. గృహ నిర్మాణానికి కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు రూ. 1.80 లక్షలు మంజూరుచేస్తున్నట్లు తెలిపారు.

టెట్ నుంచి మినహాయించాలి

సాలూరు రూరల్, అక్టోబరు25 (ఆంధ్రజ్యోతి):టెట్ నుంచి ఇన్ సర్వీసు టీచర్లకు మినహాయించాని ఏపీటీఎఫ్ పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు ఎం.మహేష్, ప్రధాన కార్యదర్శి నల్లా బాలకృష్ణ శనివారం ఒక ప్రకటనలో కోరారు. విద్యాహక్కు చట్టంలో భాగంగా 2011 నుంచి కేంద్ర ప్రభుత్వం టెట్‌ను అమల్లోకి తెచ్చిందని, కొత్త ఉపాధ్యాయులకు టెట్‌ను తప్పనిసరి చేశారని తెలిపారు. అయితే ఇప్పటికే సర్వీసులో ఉన్న వారిపై చట్టాన్ని తిరిగి రెట్రోస్పెక్టివ్‌గా చేయడం సరికాదని పేర్కొన్నారు. సుప్రీం కోర్టు తీర్పు వల్ల ఉపాధ్యాయులు ఆందోళనకు గురవుతున్నారని తెలిపారు. 25 నుంచి 30 ఏళ్ల నుంచి సేవలందిస్తున్న ఉపాధ్యాయులను ఇప్పుడు టెట్ రాయాలనడం సరికాదని పేర్కొన్నారు.

●బెలగాం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి):ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్‌మినహాయింపు ఇచ్చేలా చర్యలుతీసుకోవాలని ఏపీటీఎఫ్ నాయకుడు మత్రాపు మహేష్ డిమాండ్ చేశారు. శనివారం పార్వతీపురంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ టెట్‌పై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు అనంతరం రాష్ట్ర ప్రభుత్వం ఆ తీర్పుపై రివ్యూపిటిషన్ వేయాలని కోరారు. ఉపాధ్యాయ ఉద్యోగంసాధించే సమయంలో టెట్ అర్హత షరతు లేనప్పటికీ, ఇప్పుడు దాన్ని రెట్రోస్పెక్టివ్‌గా అమలు చేయడం అన్యాయమని తెలిపారు. ఐదేళ్లకుపైగా ఉపాధ్యాయ వృత్తిలో ఉన్న ఉపాధ్యాయులందరికీ టెట్ తప్పనిసరి చేయడంతగదని హితవుపలికారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ నాయకులు నల్ల బాలకృష్ణ పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు

మక్కువ రూరల్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని మక్కువ ఎస్ఐ ఎం.వెంకటరమణ హెచ్చరించారు. శనివారం మక్కువలోని నాలుగు రోడ్ల జంక్షన్‌లో వాహనాలు తనిఖీచేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ అక్రమంగా మద్యం, గుట్కా, ఖైనీలు వంటి మత్తు పదార్థాలు అమ్మినా కేసులు నమోదుచేసి అరెస్టు చేస్తామని తెలిపారు.

తప్పుడు ప్రచారం చేస్తే ఊరుకునేది లేదు

భామిని, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి):ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధిని పరుగుల పెట్టిస్తున్న సమయంలో వాటిపై సోషల్‌మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తే ఊరుకొనేది లేదని టీడీపీ నాయకులు హెచ్చరించారు. శనివారం బాలేరులో టీడీపీ,జనసేన నాయకులు నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే జయకృష్ణపై తప్పుడుప్రచారాన్ని ఖండించారు.ప్రెస్ భామినిపేరుతో ప్రభుత్వ వ్యతిరేక ప్రచారం చేస్తుంటే అధికారులు పట్టించుకోరా అనిప్రశ్నించారు. ఈవిషయంపై పోలీసులకు ఫిర్యా దుచేస్తామన్నారు. కార్యక్రమంలో జగదీశ్వరరావు, బి.రవినాయుడు, గోవింద, ఆనంద్, నాగేశ్వరరావు, కేశవ, ప్రసాద్, గోపాలరావు, రామకృష్ణ పాల్గొన్నారు.

శ్రమదానంతో రహదారికి మరమ్మతులు

సీతంపేట రూరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఎగువద్వారబంధం, దిగువ, నడిమి ద్వారబంధం గ్రామాల గిరిజనులు శ్రమదానం చేసి రెండు కిలోమీటర్ల పొడవు రహదారికి మరమ్మతులు చేపట్టారు. సీతంపేట మన్యంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మర్రిపాడు పంచాయతీ పరిధిలోని ఎగువద్వారబంధం రహదారి పూర్తిగా దెబ్బతింది. దీంతో ఆయా గ్రామాల గిరిజనులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందిపడుతున్నారు. దీంతో శనివారం గిరిజనులు శ్రమదానం చేసి వర్షాలకు ఏర్పడిన గుంతలను మట్టి, కంకర రాళ్లతో పూడ్చి రహదారిని సరిచేశారు.


రహదారిపై గుంతలను పూడ్చుతున్న గిరిజనులు

సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

●తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో అధికారుల సమీక్ష

సిబ్బంది అందుబాటులో ఉండాలని ఎంపీడీవోలు, తహసీల్దార్లు కోరారు. తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో ఎంపీడీవోలు, తహసీల్దార్లు సమీక్షించారు.

కంట్రోల్ రూము ఏర్పాటు

మక్కువ రూరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ వల్ల ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నామని తహసీల్దార్ కె.భరత్‌కుమార్, ఎంపీడీవో ఎస్.అర్జునరావు తెలిపారు. శనివారం మక్కువలో విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు తుఫాన్ వల్ల ప్రజలు, పంటలకు ఎటువంటి నష్టం జరగకుండా ఏర్పాట్లు చేశామని చెప్పారు. తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూము ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు వీఆర్వోల ద్వారా సమాచారం సేకరిస్తామని తెలిపారు. కాజ్‌వేలు, గెడ్డలు ఉన్నచోట ప్రజలను అప్రమత్తం చేశామని చెప్పారు. దుగ్గేరులో అడారిగెడ్డ, కవిరిపల్లి వద్ద గల గోముఖి కాజ్‌వేలపై నుంచి వరద వచ్చిన సమయంలో రాకపోకలు నిషేధించామని తెలిపారు. కార్యదర్శుల ద్వారా ఎప్పటికప్పుడు నివేదికలు తెప్పించుకొని ఎటువంటి నష్టం జరగకుండా తమ శాఖ సిబ్బందిని సిద్ధం చేశామని ఎంపీడీవో ఎస్.అర్జునరావు తెలిపారు.

●గరుగుబిల్లి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో భారీ వర్షాలతోపాటు, గాలులు వీచే అవకాశాలు ఉండడంతో సచివాలయాల సిబ్బంది స్థానికంగా ఉండాలని ఎంపీడీవో జి.పైడితల్లి కోరారు. తుఫాన్ ప్రభావంపై గ్రామాల్లో అవగాహన కల్పించాలని తెలిపారు. వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని పేర్కొన్నారు.శనివారం గరుగుబిల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, సచివాలయాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. వర్షాల వల్ల వ్యాధులు ఆశించే పరిస్థితి ఉందని, సిబ్బంది మెరుగైన సేవలు అందించాలన్నారు. సమావేశంలో ఉదయకుమారి పాల్గొన్నారు.


గరుగుబిల్లి: సిబ్బందికి సూచనలిస్తున్న ఎంపీడీవో పైడితల్లి

28న నిరసన ర్యాలీ

పాలకొండ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): పాలకొండలో ఈ నెల 28న జరిగే నిరసన ర్యాలీ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఎమ్మెల్సీ విక్రాంత్,మాజీ ఎమ్మెల్యే కళావతి శనివారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు హనుమం తురా వు, వెంకటరమణనాయుడు, కనపాక సూర్యప్రకాశరావు, మన్మథరావు పాల్గొన్నారు.

శంబర పోలమాంబకు పూజలు

మక్కువ రూరల్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని శంబర పోలమాంబను బొబ్బిలి ఎమ్మెలే బేబీనాయన శనివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ సిబ్బంది బేబీనాయనకు సత్కరించారు. ఆయన వెంట శంబర ఎంపీటీసీ తీళ్లపోలినాయుడు ఉన్నారు.

గిరిజన విద్యార్థుల ఆరోగ్యంపై నిర్లక్ష్యం తగదు

బెలగాం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) గిరిజన విద్యార్థులు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడం విషాదకరమని, వారి ఆరోగ్యంపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదని సీపీఐ నాయకుడు ఆర్వీఎస్ కుమార్ తెలిపారు. శనివారం పార్వతీపురంలో విలేకరులతో మాట్లాడుతూ శుక్రవారం మరో విద్యార్థిని మృతిచెందడంతో ప్రజలను కలవరపెడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థుల మరణాలపై ప్రభుత్వం వెంటనే విచారణ కమిటీ ఏర్పాటు చేసి బాధ్యులపై కఠినచర్యలు తీసుకోవాలని కోరారు. మృతి చెందిన విద్యార్థుల కుటుంబాలకు నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు సింహాద్రి కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

జిల్లాకు 1,670 దోమ తెరలు

పార్వతీపురం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి):జిల్లా రెడ్‌క్రాస్ సంస్థ ద్వారా 1,670 దోమతెరలు వచ్చినట్టు కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. శనివారం పార్వతీపురంలోని కలెక్టరేట్‌లో రెడ్‌క్రాస్ సంస్థ ద్వారా దోమతెరలను కలెక్టర్ స్వీకరించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర రెడ్‌క్రాస్ సంస్థ ఛైర్మన్ రామారావుతో మాట్లాడి జిల్లాకు దోమతెరలు తెప్పించినట్టు తెలిపారు. కార్యక్రమంలో పార్వతీపురం, విశాఖ, శ్రీకాకుళం రెడ్‌క్రాస్ సంస్థ ఛైర్మన్లు పి.శ్రీరాములు, సి.బాలసంతోష్, పి.జగన్మోహన్‌రావు, ఆర్ట్స్ సంస్థ డైరెక్టర్ నూక సన్యాసిరావు, జనార్దనరావు, పెంకి చైతన్య, సత్యనారాయణ, సంతోష్ పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల మంజూరు చేయండి: ఎమ్మెల్యే

పార్వతీపురం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో బలిజిపేట మండలంలో డిగ్రీ కళాశాల మంజూరు చేయాలని ఎమ్మెల్యే విజయచంద్ర కోరారు.ఈ మేరకు రాష్ట్ర కళాశాలల విద్యా డైరెక్టర్ భరత్‌గుప్తాకు శనివారం విజయవాడలో వినతిపత్రాన్ని అందించారు. ఎస్‌వీడీ కళాశాలలో పీజీ కోర్సులు ప్రారంభించాలని కోరారు. నియోజకవర్గంలో ఉన్నత విద్యాభివృద్ధికి తన వంతు కృషి చేస్తున్నట్టు ఎమ్మెల్యే తెలిపారు. మారుమూల ప్రాంత విద్యార్థులకు ఉన్నత విద్యను అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు.


భరత్‌గుప్తాకు వినతిపత్రం అందజేస్తున్న విజయచంద్ర

రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం


మాట్లాడుతున్న వైశాలి

పార్వతీపురం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురంలో రాజకీయపార్టీల ప్రతినిధులతో సబ్‌కలెక్టర్ వైశాలి సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా పోలింగ్‌కేంద్రాలపై చర్చించారు.కార్యక్రమంలో తహసీల్దార్ సురేష్ పాల్గొన్నారు.

ఐటీఐతో ఉపాధి అవకాశాలు

● ఇన్‌చార్జి పీవో పవార్‌స్వప్నిల్ జగన్నాథ్


ఐటీఐ విద్యార్థులతో మాట్లాడుతున్న పవార్‌స్వప్నిల్ జగన్నాథ్

సీతంపేట రూరల్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): ఐటీఐ శిక్షణతో విద్యార్థులు ఉపాధి అవకాశాలు పొందవొచ్చని ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో పవార్‌స్వప్నిల్ జగన్నాథ్ తెలిపారు. శనివారం స్థానిక ఐటీఐ కేంద్రంలోగల అన్ని ట్రేడుల ల్యాబ్‌లను పరిశీలించారు. ఐటీఐలో శిక్షణ పూర్తయిన తరువాత దూరప్రాంతాలకు వెళ్లి ఉద్యోగాలు చేయాల్సి ఉంటుందని విద్యార్థులకు సూచించారు. ఆయన వెంట కళాశాల ప్రిన్సిపాల్ ఎం.గోపాలకృష్ణ, సిబ్బంది ఉన్నారు.

పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలి

పాఠశాలల పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలని ఇన్‌చార్జి పీవో పవార్‌స్వప్నిల్ జగన్నాథ్ కోరారు. శనివారం స్థానిక బాలుర గురుకుల పాఠశాల, జూనియర్ బాలుర కళాశాలను సందర్శించారు. పాఠశాలలో భోజనం వంటకాల రుచిని పరిశీలించారు. గిరిజన విద్యార్థులకు మెనూ ప్రకారం పెట్టే భోజనం రుచికరంగా ఉండాలని పాఠశాల సిబ్బందిని ఆదేశించారు.

న్యాయం చేయండి

(ఐదో పేజీ తరువాయి)

అధికారులకు వివరించారు. బాధిత కుటుంబానికి రూ.50లక్షల నష్టపరిహారం చెల్లించడంతో పాటు కుటుంబంలో ఒకరికి ఉపాధి కల్పించాలని, పాఠశాల సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. న్యాయం జరిగే వరకూ ఇక్కడి నుంచి కదిలేది లేదని తేల్చిచెప్పారు. కవిత కుటుంబానికి ప్రభుత్వం నుంచి రూ.2లక్షలు ఆర్థిక సహాయంతో పాటు ఒకరికి ఔట్‌సోర్సింగ్‌లో ఉపాధి కల్పిస్తామని పీవో హామీ ఇచ్చారు. దీనిపై పూర్తిస్థాయి విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని అన్నారు. దీంతో వారు ఆందోళన విరమించారు.

రైతుల్లో తుఫాన్ కలవరం

(ఐదో పేజీ తరువాయి)

సెలవులను రద్దు చేసినట్టు ఆయన చెప్పారు.ఈమేరకు శనివారం కలెక్టరేట్‌లో అధికారులతో సమావేశం నిర్వహించారు. చెట్లు, టవర్లు, స్తంభాల కింద, పొలాలు, బహిరంగ ప్రదేశాలు, శిథిలావస్థలో ఉన్న భవనాలు, గృహాల్లో ఎవరూ ఉండకుండా చూడాలని ఆదేశించారు. నీటి ప్రవాహం ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో ప్రజలు స్నానాలు చేయడం, బట్టలు ఉతకడం, పశువులను కడగడం, చేపలను పట్టడం, ఇసుక తవ్వడం వంటి పనులు చేయరాదన్నారు. పునరావాస కేంద్రాల గుర్తింపుతో పాటు ఆహారం ఏర్పాట్లలో తహసీల్దార్లు సిద్ధంగా ఉండా లన్నారు. ఎస్‌డీఆర్ఎఫ్ బృందం సీతంపేట మండలంలో ఉండేలా చూసుకోవాలన్నారు. ముఖ్యంగా రెవెన్యూ, పంచాయతీ, విద్యుత్, తాగునీటి సరఫరా, పారిశుధ్య, వైద్య ఆరోగ్యం తదితర శాఖలు నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు. సబ్ కలెక్టర్ ఆర్.వైశాలి కూడా తన చాంబర్‌లో అధికారులతో సమీక్షించి వారిని అప్రమత్తం చేశారు.

● తుఫాన్ నేపథ్యంలో కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్టు కలెక్టర్ ఎస్.ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. ప్రజలకు ఏ అవసరం ఉన్నా కంట్రోల్ రూమ్ నెంబర్ 08963 796085కు ఫోన్ చేయాలన్నారు. వెంటనే సహాయక చర్యలు చేపడతామని తెలిపారు. రానున్న మూడు రోజులూ అన్ని శాఖల అధికారులు, సిబ్బంది మండల కేంద్రాల్లో ఉండాలని ఆదేశించారు.

●భామిని,అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి):మండలంలో శనివారం వర్షం పడడంతో మొక్కజొన్న, పత్తి రైతులు ఇబ్బందిపడ్డారు.నేరడి,భామిని, సింగిడి, బురుజోల, పసుకుడి, దిమ్మిడిజోల, ఘనసర తదితర గ్రామాల్లో ఖాళీ ప్రదేశాల్లో మొక్కజొన్నగింజలు, దూదిని ఆరబెట్టారు. వర్షం కురవడంతో మొక్కజొన్న తడిసిపోకుండా టార్పాలిన్లు కప్పారు.

మన బస్సులు భద్రమేనా?

(ఐదో పేజీ తరువాయి)

అధికారులు మార్గనిర్దేశం చేసే పరిస్థితి కానరావడం లేదు. ప్రైవేటు బస్సులపై రవాణాశాఖ అధికారులు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాల్సిన అవసరం ఉంది. ఎమర్జెన్సీ డోర్స్, ఫైర్, అలారం, వైరింగ్ సిస్టమ్ తదితర ఏర్పాట్లు ఉన్నవి? లేనిది పూర్తిస్థాయిలో పరిశీలించాల్సిన అవసరం ఉంది.

● ఎక్కువగా ఈశాన్య రాష్ట్రాలైన నాగాలాండ్, సిక్కిం రాష్ట్రాల పేరుతో ట్రావెల్స్ బస్సులు రిజిస్ట్రేషన్ చేసి ఉంటున్నాయి. అక్కడ తక్కువ పన్ను, ఫీజుతో పాటు క్షణాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తవుతుంది. కేవలం వాట్సాప్, మెయిల్‌లో వివరాలు పంపిస్తే చాలు రిజిస్ట్రేషన్ పూర్తయినట్టే. దీనివల్ల ఆ రాష్ట్ర ప్రభుత్వానికి ఏడాదికి రూ.50 వేలు చెల్లిస్తే సరిపోతుంది. మన దగ్గర అయితే స్లీపర్ బెర్తులు 36కుగాను ఒక్కో బెర్తుకు రూ.3,500 చొప్పున..ప్రతి మూడు నెలలకు రూ.1,25,000 చెల్లించాల్సి ఉంటుంది. అంటే ఏడాదికి సుమారు రూ.5 లక్షలు ఖర్చు చేయాలి.

భద్రతా ప్రమాణాలు అంతంతే..

ప్రస్తుతం బీఎస్6 బస్సులు ఎక్కువగా అందుబాటులోకి వచ్చాయి. వీటిలో పాటించాల్సిన భద్రతా ప్రమాణాల విషయమై కొంత నిర్లక్ష్యం కనిపిస్తోంది. ఫైర్‌సేఫ్టీ సర్టిఫికెట్‌ను వారు తప్పనిసరిగా తీసుకోవాలి. షార్ట్ సర్క్యూట్, ఇతర కారణాల వల్ల మంటలు చెలరేగినప్పుడు బస్సు బాడీ ప్రమాదాన్ని నియంత్రించే విధంగా ఉండాలి. దీనిని నిర్ధారించేందుకే ఫైర్ సేఫ్టీ సర్టిఫికెట్ జారీ చేస్తారు. మన రాష్ట్రంలో ఈ సర్టిఫికెట్ ఉంటేనే బస్సు రిజిస్ట్రేషన్ జరుపుతారు. అయితే ఈ సేఫ్టీ సర్టిఫికెట్ పొందడానికి రూ.2 లక్షలు ఖర్చు అవుతుంది. అదే ఈశాన్యరాష్ట్రాల్లో అయితే రూ.50 వేలుతో అయిపోతుంది. కనీస భద్రత చూడకుండా సంబంధిత అధికారులు దళారీల ద్వారా ఆ రాష్ట్ర ఫైర్‌సేఫ్టీ సర్టిఫికెట్ ఇచ్చేస్తున్నారు. మరోవైపు బీఎస్6 బస్సులు సౌకర్యవంతంగా ఉంటాయి. వీటిలో 200 వరకూ వైర్లు ఉంటాయి. చిన్న సమస్య వచ్చినా సంబంధిత కంపెనీ ప్రతినిధి రావాల్సిందే. దీంతో తనిఖీలను ట్రావెల్స్ యాజమాన్యాలు నిర్లక్ష్యం చేస్తున్నాయి. ఇదే ప్రమాదాలకు కారణమవుతోంది.